
ప్రజాశక్తి

శనివారం 9 డిసెంబర్ 2023 5 విజయనగరం



పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం

గుర్ల పోలీసు స్టేషనులో 2023లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన గుర్ల మండలం గరికివలస గ్రామానికి చెందిన గుమ్మిడి ఆదినారాయణ (36)కు ప్రత్యేక పోక్సో న్యాయస్థానం 20ఏళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. గరికివలసకు చెందిన గుమ్మిడి ఆదినారాయణ ఒక బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో దిశ మహిళా పోలీసు స్టేషనులో 2023 ఫిబ్రవరిలో పోక్సో చట్టం ప్రకారం దిశ ఎస్ఐ ఎన్. పద్మావతి కేసు నమోదు చేశారు. మహిళా పిఎస్ డిఎస్పి ఎం. వెంకటేశ్వర్లు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు.నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి తీర్పు చెప్పారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

ఆదుకోకుంటే మన్నైపోతాం



మలిచర్లలో చెరువులా తయారైన పొలంలోనుంచి వరిచేనును ఒడ్డుకు చేరుస్తున్న రైతు

'ప్రభుత్వం ఆదుకోకపోతే మన్నైపోతాం... చేతికి అందాల్సిన పంట నీటిపాలైంది.... ఈ నష్టాన్ని తాము భరించగలిగే పరిస్థితి లేదు... కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.' అంటూ రైతులు కన్నీరు పెడుతున్నారు. తొలుత నాట్లను బతికించుకోవడం కోసం ఎన్నో పాట్లు పడ్డాం. తీరా ఎలాగోలా నెట్టుకొచ్చి పంట చేతికి అందుతుందన్న ఆశపడిన క్షణాల్లో వచ్చిన తుపాను కంటిమీద కునుకు లేకుండా చేసిందని మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత వర్షాలు సహకరించినా, ప్రాజెక్టుల నుంచి నీరు వచ్చే పరిస్థితి ఉన్నా ఇంత నష్టం జరిగి ఉండేది కాదని ఇంకొంతమంది రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక గ్రామాల్లో రైతుల పరిస్థితి ఇదే.

- వరద నష్టాలతో మనోనిబ్బరాన్ని కోల్పోతున్న అన్నదాత
- 50 నుంచి 60 శాతం పంటపోయినట్టే అంటూ గగ్గోలు
- ఇప్పటికీ జల దిగ్బంధంలోనే వరికుప్పలు
- 'ప్రజాశక్తి' పరిశీలనలో వెల్లడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, గుర్ల, చీపురుపల్లి

ఇటీవల వచ్చిన మిచౌంగ్ తుపాను వల్ల పంట పొలాలు చెరువులను తలపించాయి. ఈ నేపథ్యంలో పంట నష్టం తెలుసుకునేందుకు ప్రజాశక్తి బృందం గుర్ల, గరివిడి, గజపతినగరం, మెంటాడ, వేపాడ, జామి తదితర మండలాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేసింది. ఇప్పటికీ వరి దిబ్బలు, ఓవులు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కల్లాల్లో దాచిన ధాన్యం కొనుగోలుకు నోచుకోలేదు. పొలాల్లో తడిసి ముద్దయిన వరి దిబ్బలను కొన్నిచోట్ల ఆరబెట్టేందుకు ప్రయత్నించగా మొత్తం తడిచిపోవడంతో రైతులు నిర్ఘాంతపోతున్నారు. ఇంతపనైపోతుందని ఊహించలేదని పుట్టెడు దుఖ:ంతో ప్రజాశక్తి బృందం ఎదుట ఆవేదన చెందారు. 50శాతం పంట పోయిందని కొందరు, 40శాతం పంటే వస్తుందని మరికొందరు, పావలా వాటాయే దక్కుతుందని ఇంకొందరు చెప్పారు. గుర్ల మండలంలో 9920 ఎకరాల్లో వరి సాగవ్వగా 600 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కానీ, ఇంతకన్నా ఎక్కువే ఉంటుందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్ల మండల కేంద్రంలోనే వరి రైతులకు అపారనష్టం వాటిల్లింది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ వేలాది ఎకరాలు పంట నీట మునిగింది. ఇప్పటికీ వరిచేను, దిబ్బలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కుప్పల కిందిబాగం మొత్తం నీటిలో ఊరిపోయి ముక్కువాసన వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే



గుర్ల : చింతపల్లి పేటలో వరదనీటిలో ఉన్న వరికుప్పలు

మరోవైపు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ముంపునకు గురైన పంటలను పరిశీలించడమే తప్ప నష్టాలను తేల్చకపోవడం, పరిహారం విషయం చెప్పకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

నీటి సదుపాయం లేక వర్షానికి దొరికిపోయాం



'మాకు తోటపల్లి ప్రాజెక్టు నీరు రావాల్సివుంది. కానీ, ఈ ఏడాది చుక్కనీరు రాలేదు. దీంతో, నాట్లు ఆలస్యంగా వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దాన్ని సంరక్షించు కోవడానికి ఎకరాకు రూ.10వేల వరకు అదనపు పెట్టుబడి పెట్టుకున్నాం' అంటూ గుర్ల మండలం గుర్ల, గుజ్జింగివలస, చింతపల్లిపేట, గరివిడి మండలం శేరీపేట తదితర గ్రామాలకు చెందిన ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర జలాశయం నీరు తొలి నుంచీ అందితే వర్షాలకు ముందే ధాన్యం ఇంటికి చేరేవని మెంటాడ, బొండపల్లి మండలాలకు చెందిన రైతులు, తాటిపూడి నీరు కూడా తమకు అందకపోవడం వల్లే అన్యాయమైపోయామంటూ గంట్యాడ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కంటతడి పెట్టారు. తీరా పంట చేతికి అందని సమయంలో తుపాను దెబ్బతీసిందని, సీజన్ లెక్క ప్రకారం ఆగస్టు 15లోపు ఉబాలు పూర్తయి ఉంటే ఈపాటికి చేను కల్లానికి చేర్చి, తిండికి ఉంచుకోగా విక్రయించి అప్పులు తీర్చుకునేవాళ్లం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

60 శాతం పంటపోయినట్టే



వర్షాల కారణంగా 50శాతం పంట పోయినట్టే. కోసిందంతా పొలంలోనే దిబ్బలు పెట్టినప్పటికీ మొకాళ్లలోతున చేరిన నీరు ఇప్పటికీ తగ్గలేదు. ఆరబెట్టుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. మనసు పట్టక ఒక దిబ్బను ఇరగదీస్తే కింది నుంచి సగం చేను మొత్తం కుళ్లిపోయింది. ముక్కువాస. పైబాగంలోవున్నది మాత్రమే దక్కుతుంది. అది కూడా రంగుమారే ప్రమాదం ఉంది. గడ్డి కూడా పశువుల మేతకు పనికిరాదు. ఇటువంటి ధాన్యం ప్రభుత్వం కొంటుందో లేదో. లేదంటే అప్పుల్లో కూరుకుపోతాం.

- ఎలకల సత్యం, పేరిపి గ్రామం, చీపురుపల్లి

అప్పుల్లో మునిగిపోతాం



విత్తనాలు, ఆకుతీత, నాట్లు, ఉబాలు, ట్రాక్టర్ అద్దెలు ఎకరాకు రూ.25వేల వరకు మదుపు అవ్వగా నీటి కోసం కిరోసిన్ ఇంజన్ల అద్దె మరో రూ.10వరకు అయ్యింది. నాకున్న నాలుగు ఎకరాలకు రూ.1,50, 000 మదుపు అయ్యింది. ఎకరాలో మాత్రమే వరి కోత పూర్తయ్యింది. మిగిలింది వర్షాల కారణంగా పూర్తిగా నేలకొరిగింది. ఇప్పటికీ చేనంతా నీటిలోనే ఉంది. కోసిన చేను దిబ్బలుగా పెట్టినప్పటికీ మోకాళ్ల ఎత్తున నీరు చేరడంతో కుళ్లిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- రేగాన సన్యాసప్పడు, గుర్ల గ్రామం, గుర్ల మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



పంట నష్టాలను అంచనా వేసే పని ఇంకా ప్రారంభం కాలేదు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదు. వచ్చిన వెంటనే సిబ్బంది పంట నష్టాలను అంచనా వేస్తారు. ఎన్ని ఎకరాల్లో పంట ముంపునకు గురైందో లెక్క కూడా ఇంకా కొలిక్కిరాలేదు.

- విటి రామారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, విజయనగరం

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయాలి • నాడు-నేడు పనులపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

మొదటి విడత నాడు -నేడు కింద చేపట్టిన పనులన్నిటినీ డిసెంబర్ 21 న మెగా లాంచింగ్ చేయనున్నారని, ఈ లోపల స్కూల్ మెయింటెనెన్సు ఫండ్ నుండి ఫినిషింగ్ పనులన్నిటినీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. నాడు నేడు కింద తొలి విడత లో 840 పాఠశాలలను పూర్తి చేసామని, ఆ పనులలో అదనపు భవనాలతో పాటు టాయిలెట్స్ , తాగు నీరు, చిన్న చిన్న మరమ్మత్తులు, తదితర అభివృద్ధి పనులు చేపట్టామని, వాటన్నిటినీ డిసెంబర్ 21 న ప్రారంభించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో నాడు నేడు పనుల పురోగతిపై ఎంఇఒలు, ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రివాల్వింగ్ ఫండ్ కోసం వివరాలను వెంటనే అప్లోడ్ చేయాలని, ఈ నెల 20 తర్వాత నిధులు విడుదల అవుతాయని తెలిపారు. రెండవ దశ -బి కింద 700 అంగన్వాడీ కేంద్రాలను నిర్మించడానికి అంచనాలను వారం లోగా పంపించాలని తెలిపారు. రెండో దశలో మొదటగా అంగన్వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని, తదుపరి అదనపు తరగతి గదులు, మేజర్, మైనర్ మరమ్మత్తులను, కిచెన్ షెడ్లను చేపట్టాలని సూచించారు.

మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చే ఆహారం నాణ్యంగా ఉండేలా ఎంఇఒలు చూడాలని, ఏజెన్సీలకు గట్టి వార్నింగ్ ఇవ్వాలని, వెంటనే ఈ విషయంపై స్కూల్స్ లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల కాలంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు ధర్నాలు చేస్తూ పాఠశాలలలోని లోపాలతో కూడిన జాబితాను అందించారని, ముఖ్యంగా ఎండిఎం, టాయిలెట్స్, తాగు నీరు, పారిశుధ్యం, సబ్జెక్టు టీచర్స్ తదితర అంశాలపై విజ్ఞప్తి చేసారని తెలిపారు. ఇంజినీరింగ్ సహాయకులు, సంక్షేమ సహాయకులను చైతన్యం చేసి అన్ని పాఠశాలలలో మౌలిక వసతులపై ఎంఇఒలు దృష్టి పెట్టాలని సూచించారు. సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయాలని తెలిపారు. 10 వ తరగతి కోసం 100 రోజుల ప్రణాళిక తయారు చేయాలని, 10 పరీక్షల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో శత శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని, ముఖ్యంగా రెసిడెన్షియల్ స్కూల్స్ లో తప్పనిసరిగా 100 శాతం ఫలితాలు రావాలని అన్నారు. సమావేశంలో డిఇఒ లింగేశ్వర రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, ఎంఇఒలు, ఎఇలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుపాటు జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడకు పెరుగుతున్న ఆదరణ అభినందనీయమన్నారు. పాత కాలంలో కత్తి యుద్ధమే నేడు ఫెన్సింగ్ క్రీడగా ప్రపంచంలో ఆదరణ పొందుతుందని అన్నారు. మన జిల్లాలో ఈ క్రీడను అభివృద్ధి చేయడంలో శిక్షకులు ప్రసాద్ చేసిన కృషి అభినందనీయమన్నారు. పోటీ తత్వంతో ఆడి మంచి ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికై సత్తా చాటాలని కోరారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ కంటుబుక్త తవిటి రాజు, వైసిపి నగర అధ్యక్షులు అశపు వేణు, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, చీఫ్ కోచ్, టోర్నమెంట్ నిర్వాహక కమిటీ కన్వీనర్ డివిచారి(ప్రసాద్), రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఆశా వర్కర్ల సమస్యలపై కలెక్టరేట్ వద్ద
14, 15 తేదీల్లో 36 గంటల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఈనెల 14,15తేదీల్లో 36గంటల నిరవధిక ధర్నా చేపడతామని ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, రమణమ్మ తెలిపారు. ఈమేరకు శుక్రవారం బిసి కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ చైతన్య నాయుడుకు వినతి అందజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, మొబైల్ వర్క్సపై శిక్షణ ఇవ్వాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవులు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలో పాల్గొంటామని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్.పద్మ, బి .పద్మ, ఎం.గీతా కుమారి, డి.లక్ష్మి, ఎం.ఇందుమతి, వై.లక్ష్మీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా చేరేందుకు నేడే ఆఖరు

రాజకీయ పార్టీల ఫిర్యాదులపై విచారణ చేయండి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తు చేయడానికి 9వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. వివిధ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఎన్నికల డిటిలతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా ప్రక్రియపై నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 18,19 ఏళ్ల వయసు వారి నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 2,700 వరకు ఆన్‌లైన్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని రేపటిలోగా పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. 18 ఏళ్ల లోపువారి (కాబోయే ఓటర్లు) దరఖాస్తులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. వీరికి వయసు 18 నిండిన తరువాత ఓటుహక్కు వస్తుందని చెప్పారు. ఫోటోలు మారిపోయిన, పేర్లు పదేపదే వచ్చిన వారి జాబితాను పరిశీలించి, సరిచేసేందుకు నివేదిక సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు, మరణించిన ఓటర్లు, ఇంటి నంబరు ఇతర అంశాలు తప్పుగా నమోదైన వారి గురించి ప్రధాన రాజకీయ పార్టీలు ఫిర్యాదులు ఇచ్చాయని, వాటన్నిటినీ పరిశీలించి జాబితాలను సరిదిద్దాలని ఆదేశించారు.

అన్ని రకాల దరఖాస్తులను శనివారంలోగా ఆన్‌లైన్ చేయాలని, ఈ నెల 17 లోగా వాటి పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ దరఖాస్తు అయినా 15 రోజుల్లోపలే పరిశీలన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తప్పుడు డోర్ నెంబర్లు, ఒకే డోర్ నెంబరులో పది మంది కంటే ఎక్కువగా ఉన్న ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించి సరిచేయాలని సూచించారు. జాబితాలో ఒక ఓటరు పేరు ఒక్కసారి మాత్రమే రావాలని, డూప్లికేట్లు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఇఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

11న సర్టిఫికెట్ల పరిశీలన

విజయనగరం : జిల్లా పౌరసరఫరాల సంస్థలో కాంట్రాక్టు పద్ధతిలో అకౌంటెంట్ గ్రేడ్-3 పోస్టులకు నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలనకోసం ఈనెల 11న హాజరుకావచ్చని సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి తెలిపారు. తుఫాను కారణంగా ఈనెల 8న ఈ అభ్యర్థులకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియజేశామని, అయితే వారు హాజరుకాలేక పోయినందున, 11వ తేదీన హాజరయ్యేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేరోజు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కూడా జరుగుతుందన్నారు.

ఉచిత సలహాలు మానుకొని
రైతులను ఆదుకోవాలి

తుపానుతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన టిడిపి బృందం



దెబ్బతిన్న వరిచేను పరిశీలిస్తున్న టిడిపి నేత అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం మానుకొని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. ఒకప్పుడు తుపానుతో పాటు గాలి వచ్చేదని, ఇప్పుడు తుపానుతో ప్రభుత్వ ఉచిత సలహాలు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. శుక్రవారం విజయనగరం నియోజకవర్గ పరిధిలో మలిచర్ల గ్రామంలో తుపాను వల్ల నష్టం కలిగిన వరిచేలను పరిశీలించారు. వరిపంట మొత్తం నీట మునిగి సర్వ నాశనం అయిపోయిందని రైతులంతా అశోక్‌గజపతిరాజు వద్ద కన్నీరుపెట్టారు. పంట పొలాలను ప్రత్యక్షంగా చూసి, వారి ఆక్రందన విని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ వందల ఎకరాల పంట నీట మునిగి పోయిందనిఇ, వేలాది రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు. మా కష్టాలను పరిశీలనకు వచ్చిన అధికారులతో చెప్పితే రైతు భరోసా కేంద్రాలు, విఆర్‌ఒలు వరిచేలను ఆరబెట్టి ఉప్పునీరు చల్లమంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా ఎవరూ పాటించలేని సలహాలు రైతాంగానికి ఇచ్చి పక్కతోవ పట్టిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎంత తొందరగా ఇంటికి పంపితే అంత వేగంగా ప్రజలందరికీ మేలు కలుగుతుందని అన్నారు. ఆయన వెంట విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, రాష్ట్ర బిసి సెల్ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యాలయం కార్యదర్శి రాజేష్ బాబు, కనకల మురళీమోహన్, కర్రోతు నర్సింగరావు, కోండ్రు శ్రీనివాసరావు, పైడ్రాజు, సుంకర పేట, మలిచర్ల గ్రామం రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

బాడంగి : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల రైతులు నిండా మునిగిపోయారని, వెంటనే ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు డిమాండ్‌చేశారు. శుక్రవారం మండలంలోని హెచ్.పాల్తేరులో వర్షంతో దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాలు తగ్గినా పంటలు ఇంకా నీళ్లలో నానుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. భారీగా పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే, ఖర్చులో సగం కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, నాయకులు బొంతు త్రినాధ్, ఎస్.భాస్కరరావు, వి.శ్రీరాములు, తుదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో 11న అప్రెంటిస్‌షిప్ మేళా

విజయనగరం కోట : ఈనెల 11న ప్రభుత్వఐటిఐ కళాశాలలో నిర్వహించే అప్రెంటిస్ షిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11న విజయనగరం బిసి కాలనీ, విటి అగ్రహారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఉదయం 9గంటలకు పిఎం అప్రెంటిస్ షిప్ మేళాను నిర్వహిస్తామని తెలిపారు. ఐటిఐ పాసైన వారంతా పాల్గొనవచ్చునన్నారు. షిరిడి సాయి ఎలక్ట్రికల్, మైదాన్, వరుణ్ మోటార్, జయభేరి, జిందాల్ స్టీల్ తదితర ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. వీరందరికీ ఆయా పరిశ్రమల్లో పభుత్వ ఉత్తర్వులు మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించునున్నట్లు తెలిపారు. అసక్తి గల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 2 పాస్‌పోటోలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9849118075,9849944654 సంప్రదించాలన్నారు.



ఏర్పాట్లపై ఆరాతీస్తున్న జెసి అశోక్

నేడు కేంద్రమంత్రి రాక

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి గ్రామానికి శనివారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ రానున్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో పాల్గొననున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ గ్రామంలో కేంద్రమంత్రి పర్యటన ఏర్పాట్లను జెసి మయూర్ అశోక్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులకు ఎస్‌ఎఫ్‌ఐ ధన్యవాదాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 500 కిలోమీటర్లు నిర్వహించిన సైకిల్ యాత్రలో గుర్తించిన సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటం నేటికి విజయవంతమైంది. జిల్లా విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించి ఆ సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ పోరాటమే సరైన మార్గం అని చెప్పిన ఎస్ఎఫ్ఐ నినాదం నేడు రుజువైందని హర్షం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా మండల కమిటీలు ఈపాటికే పలు దఫాలుగా అనేక ఆందోళనలు నిర్వహించి, రెండుసార్లు కలెక్టరేట్ ముట్టడించి అనంతరం అంతిమ ప్రయత్నంగా నిరవదిక నిరాహార దీక్షలకు దిగి తమ సమస్యలు పరిష్కారం చేసుకున్నారని, ఇది విద్యార్థుల విజయమని కొనియాడారు. అదే సందర్భంలో ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపించిన జిల్లా విద్యాశాఖ అధికారులందరికీ , వీరందరినీ సమన్వయం చేసి హామీలను నెరవేర్చిన జిల్లా కలెక్టర్‌కు పత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్యా రంగంలో ఇతర సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేసే పోరాటాలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని తెలిపారు.



ఎస్ఎఫ్ఐ నాయకులతో చర్చిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి
www.prajasakti.com

బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని బూరాడ గ్రామం వద్ద బస్సుల కోసం విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాజాంలో ఇంటర్, డిగ్రీ ఉన్నత చదువులకు ఉదయము కళాశాలలకు వెళ్ళవలసి ఉంది. పాలకొండ నుండి రాజాం వెళ్లే బస్సులు బూరాడ వద్ద నిలపకపోవడంతో బస్సును అడ్డుకున్నారు. కళాశాలలకు వెళ్లే బస్సులు నిలుపుదల చేయక సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగినన్ని బస్సు పాసులు ఇచ్చినప్పటికీ ఒకట్రెండు సర్వీసులు మాత్రమే నడుపుతున్నారని వాపోయారు. ఆ తర్వాత బస్సులు ఆపడం లేదని చెప్పారు. బస్సు ఆపడంపై డ్రైవరు, కండక్టర్ స్పందిస్తూ బస్సు నిండిపోవడం వల్ల ఆపలేదని, మీరు డిపో మేనేజర్‌కి ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు బదులిచ్చారు. స్థానిక పోలీసులు వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.


బస్సును నిలుపుదల చేసిన విద్యార్థులు

ప్రభుత్వ తీరుతో రైతులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-బాడంగి

ప్రజలను, రైతులను అనేక ఇబ్బందులకు గురి చేయడమే ప్రధాన ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు ఆరోపించారు. మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రభుత్వం భూముల రీసర్వే పేరుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందన్నారు. దీనివల్ల ఇదివరకే భూములు అమ్మకాలు జరిగిన వాటికి వన్‌బిలు, మ్యుటేషన్లు రాక పెళ్లిళ్ళు, విద్య, వైద్య, ఇతర అవసరాల నిమిత్తం అమ్ముకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించి, భూములు రిజిస్ట్రేషన్, వన్‌బిలు, ముటేషన్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.

రక్తదానానికి ముందుకు రావాలి

విజయనగరం కోట : యువత అపోహలు విడనాడి రక్తదానం సామాజిక బాధ్యతగా స్వీకరించి రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ చిన్నపిల్లలు వైద్య నిపుణులు, వెంకటపద్మ ఫౌండేషన్ అధినేత డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.సుధ కుమారి, సూర్యనారాయణ, బ్యాంక్ క్లస్టర్ హెడ్ సూర్య నదేళ్ల, బ్రాంచ్ మేనేజర్ వీర బాబు, ఆపరేషన్స్ మేనేజర్ సాయికుమార్ ముత్యాల, ఎన్‌విఎన్. బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభ

విజయనగరంకోట : ఈ నెల 10న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని కాంట్రాక్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి మహేంద్ర బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కలిసి సమస్యల పరిష్కారానికి విజయవాడ జింఖానా మైదానంలో జరగబోయే మహాసభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.మహేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీను, పార్వతీపురం జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

నెల్లిమర్ల : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అందరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి వి.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే పురస్కరించుకొని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని, అలా చేయకపోతే రద్దు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ జి.రామారావు, జెఇ ఆర్.పవన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరజాపుపేట జగనన్న కాలనీని సందర్శించారు. 75 ఇళ్ల పునాది స్థాయి, 8 ఇళ్ల స్లాబ్ లెవెల్‌లో ఉన్నట్లు గుర్తించారు. వీటిని 10రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి

బొబ్బిలి : మున్సిపాలిటీని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. కాంగ్రెసు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన రోడ్లు, కాలువలు మాత్రమే ఇప్పటికీ ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేయా లని, మురుగునీటి కాలువ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

బొబ్బిలి : గ్రంథాలయాలతో విజ్ఞానం పెరుగుతుందని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయానికి శుక్రవారం వాసు విద్యాసంస్థల ఆధ్వర్యంలో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత విజ్ఞానాన్ని పెంచుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణమూర్తి, చంద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలి

వంగర : గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపిపి యు.సురేష్ ముఖర్జీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ముఖ్య ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఎఒ లోపింటి త్రినాథ్, ఇఒపిఆర్‌డి జి.విజయకుమార్ పాల్గొన్నారు.

నేడు భోగాపురంలో జనసేన కార్యాలయం ప్రారంభం

భోగాపురం : భోగాపురంలో జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని శనివారం నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తున్నట్లు అపార్టీ నాయకులు లోకమాధవి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. జనసేన కార్యాలయం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారం తెలిపే దిక్సూచి కేంద్రమని అన్నారు. మూడు జిల్లాలకు మధ్యలో నిర్మించిన ఈ పార్టీ కార్యాలయం ఉత్తరాంధ్ర పార్టీ కార్యాలయంగా మారుతుందన్నారు. ప్రారంభోత్సవానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆమె కోరారు.

'సీతం' ఆధ్వర్యంలో 'ఈచ్ వన్ -రీచ్ వన్'

విజయనగరం : స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వార్యాన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా చేపట్టిన 'ఈచ్ వన్ -రీచ్ వన్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు 30 మంది బృందం శుక్రవారం కొండకరకాం గ్రామాన్ని సందర్శించింది. ఈ బృందం గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణ, ప్లాస్టిక్ నివారణ, పారిశుధ్య నిర్వహణ, మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఇటువంటి కార్యక్రమం నిర్వహించినందుకు సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి, బృందాన్ని అభినందించారు.

సుధీర్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - జామి

ఉన్నత చదువులు చదివి చిన్న వయసులో పారిశ్రామిక వేత్తగా ఎదిగిన ఆళ్ల లక్ష్మణకుమార్ (సుధీర్) ఊహించని స్థితిలో మృతి చెందడం యువతకు తీరని లోటని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి అన్నారు, సుధీర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా అట్టాడలోని బి.ఎస్.ఆర్ ఆశ్రమంలో సుధీర్ మిత్రబృందం ఏర్పాటు చేసిన సంతాప సభలో భీశెట్టి మాట్లాడారు. బాధ్యతారాహిత్యంతో ఓ వ్యక్తి చేసిన తప్పు సుధీర్ ప్రాణం తీసిందని, గొప్ప మానవతా విలువలు కలిగిన యువకుడిని సమాజం కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా సుదీర్ పేరున మండలంలో క్రీడాకారులకు, విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలు అందించాలని సుదీర్ మిత్రబృందం నిర్ణయం తీసుకోవడాన్ని భీశెట్టి అభినందించారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, తువాళ్లు అందజేశారు. ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఆశ్రమం నిర్వాహకులు భీంపల్లి భాస్కరరావు, సారిక చిట్టమ్మ, లక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయాం.. ఆదుకోండి

వ్యవసాయ సలహామండలి సమావేశంలో రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-కొత్తవలస

భారీ వర్షాలతో పంట నష్టపోయామని, తమను ఆదుకోవాలని రైతులు.. అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని తుమ్మికాపల్లిలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ వి.కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎడి ఎల్.విజయ, ఎఒ మాధురి శరణ్య, ఆర్ఐ రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, పంట చేతికొచ్చే సమయంలో తుపాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని కోరారు. చైర్మన్ కొండలరావు స్పందిస్తూ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీనిచ్చారు. ఎడి విజయ మాట్లాడుతూ పంట నష్టం అంచనాను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.


గజపతినగరం.. సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పైడిరాజు

గజపతినగరం : మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ సామంతుల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మహారాజన్ మాట్లాడుతూ తుపానుతో నీటమునిగిన పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఎఒ ధనలక్ష్మి, ఉద్యానాధికారి రాజశేఖర్, పశువైద్యాధికారి శశిభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ జమ్ము అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఎఒ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ వర్షానికి తడిచిన పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

రైతుకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - జామి

తుపాను వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు భరోసానిచ్చారు. శుక్రవారం మండలంలోని కలగాడ, మామిడిపల్లి గ్రామాల్లో తుపాను బాధితులను పరామర్శించారు. పంట నష్టం జరిగిన ప్రాంతాలలో రైతులను కలిసి, నష్ట తీవ్రతను తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడిన ఆయన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అధైర్య పడవద్దని, జగనన్న ఉన్నంత కాలం ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని ధైర్యం చెప్పారు. అక్కడికి వచ్చిన వ్యవసాయ అధికారులతో మాట్లాడి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, డిసిసిబి డైరెక్టర్ పి.సంజీవు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

శృంగవరపుకోట : ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిల్తంపాలెంలో సంక్షేమ పథకాల పట్టిక బోర్డును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వి.సోంబాబు, సర్పంచ్ ఈశ్వరరావు, సారిపల్లి గణేష్, ఎలమంచిలి రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు సహకరించాలి

ప్రజాశక్తి-గంట్యాడ


ధాన్యం కొనుగోలులో రైతులకు సహకరించాలని తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి.. మిల్లర్లకు సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మిల్లర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపానుతో వరిపంటకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా రంగుమారిన ధాన్యంతో సహా కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లు స్పందిస్తూ రంగుమారిన ధాన్యం తీసుకుంటామని, ప్రభుత్వం తమకు సహకరించాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. సమావేశంలో ఎఒ బి.శ్యామ్ కుమార్, సిఎస్ డిటి జయ, మిల్లర్లు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల మెరుగుకు శిక్షణ

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తూ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఎపిఎస్‌డిసి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ యువత చదువుతున్న సమయంలోనే ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచుకునేందుకు విషయ అవగాహనతోపాటు సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ కలిగి ఉండాలని సూచించారు. ఉపాధి అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదని, వీటికి ధీటుగా పలు కార్పొరేట్ సంస్థలు అత్యధిక వేతనాలతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాల్లో చేరే నాటికి చేసే పని పట్ల అవగాహన కలిగి ఉంటే మెరుగైన వేతనాలు లభిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. సంప్రదాయ డిగ్రీలతోపాటు సాంకేతిక కోర్సులు నేర్చుకున్న వారికి ఉద్యోగ సాధన దిశగా శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ గోవిందరావు, కళాశాల కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్, ప్రిన్సిపల్ నల్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


బాడంగి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : శంబంగి

బాడంగి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, గ్రామాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోడూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో కలిగిన లబ్ధిని వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీరు, సిసి రోడ్లు, కాలువలు, గ్రావెల్ రోడ్లు, సచివాలయాలు ఏర్పాటుచేశామన్నారు. పేదల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే వెంటనే సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తెంటు మధు, మరిపి శంకర్, మరిపి రమేష్, రెడ్డి కృష్ణ, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిటిసి శ్రీదేవి, సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం : పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు వచ్చినప్పటికీ వాటిని స్థానిక అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. తుపాను బాధిత రైతులందరికీ పారదర్శకంగా నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మామిడివలస, ఇట్లమామిడిపల్లి, తారాపురం గ్రామాల్లో 30, మిగతా గ్రామాల్లో సుమారు 250 పట్టాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ సులోచనరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఆర్‌డిఒ సాయిశ్రీ, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఉప తహశీల్దార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ


గజపతినగరం.. క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న యువతీ, యువకుల సామర్థ్యాన్ని గుర్తించాలని, వారిలో ఉత్సాహం నింపాలని, ఆత్మవిశ్వాసం పెంపొందాలనే మంచి ఉద్దేశంతో సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 15 ఏళ్ల నుండి 60 ఏళ్లలోపు వయసు గలవారు ఎవరైనా ఆడుదాం ఆంధ్రా వెబ్‌సైట్‌లో, క్యూఆర్ కోడ్ ద్వారా, టోల్ ఫ్రీ నెంబర్ 1902కి కాల్ చేయడం, వాలంటీర్ సర్వే ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 15 నుండి జనవరి 31 వరకు వివిధ స్థాయిల్లో క్రీడా సంబరాలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు క్రీడా సామగ్రిని ప్రభుత్వం సచివాలయాలకు అందిస్తుందన్నారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, వైసిపి నాయకులు లెంక గణేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : డిసెంబర్ 15నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కు క్రీడా కిట్లును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో క్రీడా సామాగ్రిని సచివాలయాల వారీగా అయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పండగ వాతావరణంలో గ్రామ స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఐదు క్రీడా అంశాల్లో నిర్వహిస్తోందన్నారు. సుమారుగా రూ.50 కోట్లతో ఖర్చుతో పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడా కారులను గుర్తించేందుకు ఈ క్రీడలు ఎంతో దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిఎస్‌డిఒ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే టిడిపికి తెలుసా?

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మెరక ముడిదాం

'అభివృద్ధి అంటే ఏమిటో టిడిపికి తెలుసా? ఎపుడైనా, ఏ పంచాయతీలో నైనా ఒక పది మందికి ఉద్యోగాలు వేసారా? అమరావతిలా గ్రాఫిక్స్ చూపించటం, మాయ మాటలు చెప్పటం కాదు అభివృద్ధి అంటే' అంటూ టిడిపిపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విరుచుకు పడ్డారు. శుక్రవారం గాదెల మర్రివలస పంచాయతీలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అనేది ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివని అన్నారు. గాదెల మర్రివలస గ్రామంలో 668 గడపకు సుమారు పదహారున్నర కోట్ల రూపాయలు పారదర్శకంగా లబ్ది దారులకు వారి ఖాతాల్లో వేయటం జరిగిందని తెలిపారు. అర్హులైన వారికి 332 పెన్షన్లు ఇచ్చామన్నారు. రూ.3.50లక్షలతో కల్వర్టు నిర్మించామన్నారు. బద్నాయుడు వలస నుండి గాజుల రామచంద్రపురానికి తారు రోడ్డు వేశామన్నారు. కోటి రూపాయలతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కూడా త్వరలో ఇస్తామని తెలిపారు. కార్యక్రమం లో మాజీ ఎంపిపి తాడ్డి వేణుగోపాలరావు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ దేవ, నారాయణరావు, గొట్టిపల్లి సర్పంచ్ సుంకరి రమేష్, పులిగుమ్మి సర్పంచ్ తల చుట్ల ఈశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్, కర్రోతు నాగేశ్వరరావు, ఎంపిడిఒ రత్నం, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని రాజా కాలేజీ రోడ్డు, బళ్లవీధి, స్టేట్ బ్యాంకు జంక్షన్, గాంధీ బొమ్మ, వెలమవారివీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. స్టేట్ బ్యాంక్ కూడలిలో మెకానిక్ షెడ్డు వద్ద మురుగునీటి కాలువలో చెత్త వేసిన షాపు యజమానికి రూ.2 వేలు జరిమానా విధించారు. గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న మైహోం అపార్టుమెంట్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి విడిచిపెట్టడంతో రూ.2 వేలు జరిమానా విధించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఆయనతో శానిటరీ ఇన్స్పెక్టర్ శివ ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రామంలో తుపానుతో దెబ్బతిన్న పంటలను ఎఒ వి.హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. పంటలను కాపాడుకునేందుకు రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. పంట నష్టంపై ప్రభుత్వం నుంచి విధి విధానాలు వచ్చిన వెంటనే అంచనా వేస్తామన్నారు.

విద్యాసంస్థల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ గురుకులం, కెజిబివి, మోడల్ పాఠశాలలను శుక్రవారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రవర్తనకు పదును పెట్టాలి

ప్రజాశక్తి-డెంకాడ

ప్రవర్తనకు పదును పెడితేనే జీవిత సాఫల్యాన్ని పొందవచ్చని పూణేకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వేదాంత ఆధ్యాత్మిక గురువు సుశీల తెలిపారు. లెండి కళాశాల వ్యక్తిత్వ వికాస తరగతులలో భాగంగా సంస్థ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ సెల్, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవతా ప్రవర్తన, లక్ష్య సాధనపై పట్టు సాధించాలంటే మొదట కోరికలను జయించాలని సూచించారు. విభిన్న మనస్థత్వాలు, భావోద్వేగ నియంత్రణ, ఆనందమయ జీవన మార్గపు సూత్రాలు గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ వి.వి.రామారెడ్డి మాట్లాడుతూ మంచి విద్యకు మానవతా విలువలు జోడిస్తేనే అసలైన సార్థకత అన్నారు. సంస్థ చైర్మన్ పెద్దిరెడ్డి మధుసూదనరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కోడూరు శివరామకృష్ణ.. సుశీలను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, ఫెమినా వింగ్ కోఆర్డినేటర్లు జానకి, తిరుమల, పీడీ శైలజ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుశీల

గ్రామ అభివృద్ధిలో కార్యదర్శులే కీలకం

ప్రజాశక్తి- మెంటాడ

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శులే కీలకపాత్ర వహించాలని వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి విమలకుమారి అధ్యక్షతన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 29 పంచాయతీల కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి నిధుల సేకరణ, విధి నిర్వహణపై శిక్షణలో వివరించారు. ఎంపిపి డి.సత్యవంతుడు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు సేకరించే బాధ్యత కార్యదర్శులదేనని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమ పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి శివారులో బొబ్బిలి-తెర్లాం రోడ్డుకు వైసిపి నియోజకవర్గ నాయకులు శంబంగి వేణుగోపాల్‌నాయుడు సొంత నిధులతో మరమ్మతులు చేపడుతున్నారు. గురువారం అదే రోడ్డులో ఏర్పడిన గోతుల్లో లారీ దిగబడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వేణుగోపాల్ స్పందించి, మరమ్మతులు చేపడుతున్నారు. ఈ పనులను దగ్గరుండి ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణా రావు, కో-ఆప్షన్ సభ్యులు తెర్లి సత్యారావు, సచివాలయ కన్వీనర్ మండల జనార్దనరావు, దమ్మ అప్పారావు పాల్గొన్నారు.


మరమ్మతులను పరిశీలిస్తున్న వైసిపి నేత వేణుగోపాల్‌నాయుడు

పార్టీలకతీతంగా పథకాలు


జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పాడ సూర్యనారాయణ

ప్రజాశక్తి -భోగాపురం

పార్టీతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని ఎ.రావివలస సచివాలయ పరిధిలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో, పథకాలు అందించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను, పథకాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, సవరవల్లి సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి , ఉప సర్పంచ్ నడుపూరు సత్యనారాయణ సూరిబాబు, నారు సాయి తదితరులు పాల్గొన్నారు.

జెసి రాజుకు సత్కారం

రామభద్రపురం : ఇటీవల విజయవాడలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ పురస్కారాన్ని పొందిన నాయుడువలస పాఠశాల ఉపాధ్యాయులు జెసి రాజుకు ఉపాధ్యాయులు ఘనసత్కారం చేశారు. శుక్రవారం హెచ్‌ఎం నాగభూషణం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు జెసి రాజును సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, శేఖర్, శివున్నాయుడు, రవికుమార్, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ గ్రామానికి చెందిన సెగము అశోక్‌వర్ధన్ (15) గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. అశోక్ గంట్యాడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం పక్కింటిలోని డబ్బులు దొంగతనం చేస్తుండగా వారు చూశారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్తారనే భయంతో సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. అశోక్ తల్లి కాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఎస్‌బిఐలో చోరీకి యత్నం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చింతలపాలెం వద్దనున్న ఎస్‌బిఐ బ్రాంచిలో గురువారం అర్థరాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. రాత్రి గస్తీలో ఉన్న పోలీసుల రాకను పసిగట్టి దుండగులు పరారయ్యారు. అప్పటికే ఎటిఎం, బ్యాంకు తాళాలు తీసేశారు. అప్రమత్తమైన పోలీసులు బ్యాంకును క్షుణ్ణంగా పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించింది. బ్యాంకుకు ఎటువంటి నష్టమూ కాలేదని చెబుతున్నారు.